క్లుప్తంగా

మెరుగైన వైద్య సేవలు అందించాలి



రామారెడ్డి: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శిరీష వైద్యాధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆమె గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్య సిబ్బంది అందరూ ప్రజలకు అందుబాటులో సేవలందించాలని సూచించారు.

పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారికి వీడ్కోలు



కామారెడ్డి అర్బన్: ఉద్యోగ విరమణ పొందిన పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి కే.సంజయ్ కుమార్ కు గురువారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అడిషనల్ కలెక్టర్లు చందర్, విక్టర్‌లతో పాటు తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం నాయకులు ఘనంగా వీడ్కోలు పలికారు. సంజయ్‌కుమార్ సేవలను కొనియాడుతూ సన్మానించారు. కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి, కార్యదర్శి మల్క నాగరాజు, ప్రతినిధులు దేవరాజు, పోచయ్య, సంతోష్‌కుమార్, కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే



బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలలో గురువారం జూనియర్, సీనియర్ విద్యార్థులు ఘనంగా ఫ్రెషర్స్ డే జరుపుకున్నారు. ఈసందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ సునీత మాట్లాడుతూ అందరు పాఠశాలలో అన్నదమ్ముల్లాగా కలిసి మెలిసి ఉండాలన్నారు. చదువుతో పాటు అన్ని రంగాల్లో విద్యార్థులు రాణించాలని కోరారు. తల్లిదండ్రులు ఆశయసాధనకు కృషి చేయాలని కోరారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యూరియా, ఎరువులను మోతాదులో వాడాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): రైతులు తమ పంటలకు యూరియా ఎరువులను తగిన మోతాదులో వాడాలని మాల్తుమ్మెద ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రేవంత్ అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంటల రక్షణలో రైతులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. గురువారం తాడ్వాయి మండలం ఎర్రాపహాడ్‌లో శివారులో గల పంటలను క్షేత్రస్థాయిలో ఏరువాక శాస్త్రవేత్తలు పరిశీలించారు. మొక్కజొన్నపంటలో కత్తెర పురుగు, వేరుకుళ్లు, వడలుతెగులు ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. వ్యవసాయ అధికారుల సలహామేరకు పంటలకు మందులను పిచికారి చేయాలని సూచించారు. పంటల రక్షణలో రైతులు మెలుకువలు పాటించాలన్నారు.కార్యక్రమంలో కోఆర్డినేటర్ అనిల్‌రెడ్డి, విస్తీర్ణాధికారి శివచైతన్య, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ క్యాంపు

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి భవిత కార్యాలయంలో గురువారం ఫిజియోథెరపీ క్యాంపు నిర్వహించారు. అంగవైకల్యం గల చిన్నారులకు ఫిజియోథెరపీ వైద్యులు డాక్టర్ అరుణ్ వైద్య పరీక్షలు నిర్వహించారు. రోజు వ్యాయామం చేయడంతో అంగవైకల్యం దూరమవుతుందన్నారు. సిబ్బంది వెంకటేశం తదితరులున్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేత



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన విద్యార్థులు తమ తరగతిలో మెరిట్ సాధించడంతో వారికి నగదు ప్రోత్సాహకాలు బిగ్ హెల్ప్ సంస్థ ప్రతినిధులు అందజేశారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రథమ, ద్వితీయ స్థానంలో ఉన్న పది మంది విద్యార్థులకు రూ. 200 నుంచి రూ. 1000 వరకు పారితోషికం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడారు. ప్రధానోపాధ్యాయుడు అంజల్‌రెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్ సలీం, అవార్డు డైరెక్టర్ సంతోష్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బీబీపేట రైతువేదికలో పింఛన్ల కోసం సిబ్బందితో వాగ్వాదం చేస్తున్న లబ్ధిదారులు



దోమకొండలో పింఛన్ పంపిణీ కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్న వృద్ధులు



మహమ్మద్‌నగర్ పోస్టాఫీసు నుంచి నిరాశతో వెనుదిరిగి వెళ్తున్న తుంకిపల్లితండా లబ్ధిదారులు

ఏడీ 'పింఛన్'

- ఫేస్ రికగ్నేషన్‌తో పలు చోట్ల పెన్షన్ల పంపిణీలో జాప్యం
- బీబీపేటలో పోస్టాఫీసు సిబ్బందితో వాగ్వాదానికి దిగిన లబ్ధిదారులు

బీబీపేట: జూలై నెలకు సంబంధించిన ఆసరా పింఛన్ల పంపిణీకి ఫేస్ రికగ్నేషన్ (ముఖచిత్రాల)తో నమోదు ప్రక్రియ ప్రవేశపెట్టడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారు. గతంలో లబ్ధిదారుల వేలిముద్రల ద్వారానే పింఛన్ జరిగేది. పింఛన్ల పంపిణీకి పోస్టాఫీసు సిబ్బంది తక్కువగా ఉండడం, ఫేస్ రికగ్నేషన్ సమస్యలతో లబ్ధిదారులకు కష్టాలు ఎదురవుతున్నాయి. దీంతో సిబ్బందితో ఘర్షణ చోటుచేసుకున్న ఘటన గురువారం బీబీపేట మండల కేంద్రంలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే బీబీపేటలో సుమారు 2300 మంది పింఛన్‌దారులు ఉండగా వారికి ఈ నెల రావాల్సిన పింఛన్లు కాస్త ఆలస్యంగా వచ్చాయి. దీంతో 30వ తేదీ నుంచి పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. గురువారం ఉదయం రైతువేదిక వద్ద కేవలం ఇద్దరు పోస్టాఫీసు సిబ్బంది పింఛన్లు పంపిణీ చేశారు. అప్పటికే ఆలస్యం కావడం, ఇద్దరు మాత్రమే పంపిణీ చేస్తుండడంతో పింఛన్‌దారులు ఒక్కసారిగా సిబ్బందితో వాగ్వాదం పెట్టుకున్నారు. అక్కడున్న ఫర్నిచర్‌ను కింద పడేశారు. దీంతో సిబ్బంది పింఛన్లు ఇవ్వడం బంద్ చేయడంతో మరింత ఉద్రిక్తత చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ ప్రభాకర్ పింఛన్‌దారులను సముదాయించారు. అలాగే ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్ వారితో మాట్లాడి స్థానిక ఎస్సీ హాస్టల్‌లో గేటు దగ్గర పోలీసు కానిస్టేబుల్‌లను ఉంచి పంపిణీ చేశారు. పంపిణీ చేసే సిబ్బంది తక్కువగా ఉండడమే ప్రధాన కారణమని, అలాగే ఈసారి ఫేస్ రిక్నగేషన్ తీసుకొని పంపిణీ చేస్తుండడంతో మరింత జాప్యం అవుతుందని సిబ్బంది తెలిపారు. వృద్ధులకు, వికలాంగులకు, బీడీ పెన్షన్‌దారులకు వేర్వేరు చోట్ల పంపిణీ చేయాలని ప్రజలు ఆందోళన చేశారు.



ఎస్సీ హాస్టల్ వద్ద క్యూ లైన్‌లో వేచి ఉన్న మహిళలు

నిజాంసాగర్/దోమకొండ : మహమ్మద్ నగర్ మండల కేంద్రంలోని పోస్టాఫీసు వద్ద మహమ్మద్ నగర్, గున్కుల్,తుంకిపల్లి, తుంకిపల్లితండా గ్రామాల లబ్ధిదారులు పింఛన్ కోసం బారులు తీరారు. డబ్బుల కోసం పోటీ పడటంతో పోస్టాఫీసు సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పోస్టాఫీసు వద్ద పడిగాపులు కాసినా ఆసరా పింఛన్ డబ్బులు చెల్లించకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. ఆన్‌లైన్‌లో ఎఫ్‌ఆర్‌ఎస్ నమోదుకు సర్వర్, సాంకేతిక సమస్య తలెత్తడంతో పింఛన్ల పంపిణీ ఆలస్యం అవుతుంది. నిజాంసాగర్ మండల కేంద్రానికి గోర్గల్, మాగి, సుల్తాన్ నగర్ గ్రామాల లబ్ధిదారులు డబ్బుల కోసం నర్వా పోస్టాఫీసు వద్ద పడిగాపులు కాశారు. దోమకొండ మండల కేంద్రంలో పింఛన్ డబ్బుల కొసం లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఫేస్ రికగ్నేషన్ కారణంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాశారు. ఇద్దరు పోస్టాఫీసు సిబ్బంది మాత్రమే పింఛన్ ఇవ్వడంతో గందరగోళం నెలకొంది. ఈ విషయంపై పోస్టుమాస్టర్‌తో మాజీ జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్ మాట్లాడారు. ఆగస్టు 2వ తేదీ వరకు పింఛన్ డబ్బులు ఇస్తామని ఎవరూ ఆందోళన చెందవద్దని పోస్టుమాస్టర్ కోరారు.

నాగిరెడ్డిపేట : మండలంలోని చీనూర్‌లో ముఖ గుర్తింపు ఆధారంగా లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. కాగా ముఖ గుర్తింపు ఆధారంగా చేపట్టిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా సోషల్ సెక్యూరిటీ ప్రాజెక్టు మేనేజర్ శోభారాణి పరిశీలించారు. ప్రతి లబ్ధిదారుడు ముఖ గుర్తింపు ఆధారంగా పింఛన్ల పంపిణీని సద్వినియోగం చేసుకోవాలని ఆమె చెప్పారు. దీంతో పంపిణీలో ఎక్కడా అవకతవకలు జరగబోవని ఆమె పేర్కొన్నారు.

తెలంగాణ అంటేనే కమ్యూనిస్టులు

- సీపీఎం రాష్ట్రకార్యదర్శి జాన్‌వెస్లీ



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్రకార్యదర్శి జాన్‌వెస్లీ

భిక్కనూరు: తెలంగాణ అంటేనే కమ్యూనిస్టులు అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. గురువారం భిక్కనూరు సమీపంలో విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ రాష్ట అధ్యక్షుడు రాంచందర్ రావు కమ్యూనిస్టులు బీజేపీ చేరాలని అనడం సిగ్గుచేటన్నారు. తెలంగాణ ప్రజలు కమ్యూనిస్టులు పోరాట యోధులన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధపోరాటం కమ్యూనిస్టుల సారథ్యంలో జరిగిందన్న విషయాన్ని బీజేపీ మర్చిపోవడం శోచనీయమన్నారు. తెలంగాణ ప్రాంతంలో మూడు వేల గ్రామాలకు విముక్తి కలిగించి పదివేల ఎకరాల భూములన దొరల నుంచి పేద ప్రజలకు పంపిణీ చేయించిన చరిత్ర కమ్యూనిస్టులది అన్నారు. కమ్యూనిస్టులు ప్రజల విముక్తి కోసం పోరాటం చేస్తే బీజేపీ ఆర్‌ఎస్‌ఎస్‌లు మాత్రం బ్రిటీష్ వాళ్లకు అనుకూలంగా పనిచేసిన చరిత్ర వాళ్లది అన్నారు. కామారెడ్డి జిల్లాలో దేవాలయ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకోని దేవాలయాల భూములను కాపాడాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర నేత ఆర్. వెంకట్‌రాములు, జిల్లా కార్యదర్శి కే చంద్రశేఖర్, కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటిగౌడ్, మోతిరాంనాయక్, కొత్తనర్సింలు, జిల్లా కమిటీ సభ్యుడు ముదాం అరుణ్‌లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం చేయాలి



మాట్లాడుతున్న దశరథ్

కామారెడ్డి అర్బన్: భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ) కామారెడ్డి పట్టణ కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ కార్యదర్శిగా పి.బాలరాజు, సహాయ కార్యదర్శులు కే.శ్రీనివాస్, రాజిరెడ్డి, కోశాధికారిగా ఎండీ రఫీక్, కార్యవర్గ సభ్యులుగా డి.అశోక్, భీమయ్య, ఎం.ప్రవీణ్, బాజీ, పి.శివప్రసాద్, అఖిల, శ్యామల ఎన్నికయ్యారు. ఈసమావేశానికి జిల్లా కార్యదర్శి ఎల్.దశరథ్ ముఖ్యఅతిథిగా హాజరై వివిధ ప్రజ సమస్యలపై మాట్లాడారు. తాగునీరు, నకిలీ విత్తనాలు, ఎరువుల కొరత, కల్తీ వంట నూనెలు, పట్టణ రోడ్లు, పారిశుద్ధ్య సమస్యలపై మాట్లాడారు. కొత్తగా ఎన్నికైన ప్రతినిధులు ప్రజా సమస్యలపై నిరాంతర పోరాటం చేయాలని దశరథ్ నిర్దేశం చేశారు.

ఐకేపీ ఏపీఎంల బదిలీలు



నిజాంసాగర్ నుంచి బదిలీపై వెళ్తున్న ఏపీఎంను సన్మానించిన ఐకేపీ ఉద్యోగులు

నిజాంసాగర్(జుక్కల్): జిల్లాలోని పలు మండలాల ఐకేపీ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లు బదిలీ అయ్యారని ఐకేపీ సురేందర్ తెలిపారు. 10 ఏళ్ల పాటు ఆయా మండలాల్లో ఏపీఎంలుగా పనిచేసిన అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లను ప్రభుత్వం బదిలీ చేసిందన్నారు. జిల్లా వ్యాప్తంగా బదిలీ అయిన ఏపీఎంలు గురువారం ఆయా మండలాల్లో బాధ్యతలు తీసుకున్నారు. నాగిరెడ్డిపేట, పెద్దకొడప్‌గల్, బీబీపేట మండలాల ఏపీఎం పోస్టులు మాత్రం ఖాళీగా ఉన్నాయని చెప్పారు. మిగితా మండలాల్లో ఏపీఎంలను భర్తీ చేయడం జరిగిందన్నారు.

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఐకేపీ ఏపీఎం జగదీశ్‌కుమార్ నాగిరెడ్డిపేట మండలానికి 10ఏళ్లుగా అందించిన సేవలు మరువలేనివని మండల సమాఖ్య అధ్యక్షురాలు బేస్త శాంత పేర్కొన్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా మద్నూర్ మండలానికి బదిలీపై వెళ్తున్న నాగిరెడ్డిపేట ఏపీయం జగదీశ్‌కుమార్‌ను గురువారం మండల సమాఖ్య సిబ్బంది ఘనంగా సత్కరించారు. సీసీలు నారాయణ, రమేష్, దత్తు, శ్రీనివాసరెడ్డి, సాయిలు, సుజాత, అకౌంటెంట్ రాజు, కంప్యూటర్ ఆపరేటర్ రవి తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట ఐకేపీలో విధులు నిర్వహిస్తున్న ఏపీఎం బదిలీ అయ్యారు. ఏపీఎం శ్రీనివాస్ బదిలీపై సదాశివనగర్ వెళ్లారు. ఆయన స్థానంలో లింగంపేట ఏపీఎంగా బోధన్ నుంచి వినోద్ బదిలీపై వచ్చారు.

చెత్తను తొలగించిన పారిశుద్ధ్య కార్మికులు



సాక్షి ఎఫెక్ట్...

బిచ్కుంద(జుక్కల్) : మండల కేంద్రంలో గురువారం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు రోడ్లపై ఉన్న చెత్తను తొలగించి రోడ్లు శుభ్రం చేశారు. గురువారం 'ఎక్కడి చెత్త అక్కడే'... అని ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. ఆయా వార్డులలో ఉన్న చెత్తను తొలగింపజేశారు. చెత్తతో కూడుకుపోయిన మురికి కాలువలను శుభ్రం చేశారు. ఇళ్లలోని చెత్తను రోడ్లపై వేయవద్దని సూచించారు. ట్రాక్టర్ ద్వారా చెత్త సేకరణ జరుగుతుందని, పారిశుద్ధ్య సిబ్బందికి చెత్త ఇవ్వాలని అధికారులు కోరారు.

విద్యార్థి సంఘాల ధర్నా



బాన్సువాడ : పట్టణంలో అనుమతులు లేకుండా కొనసాగుతున్న శ్రీచైతన్య పాఠశాలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం శ్రీచైతన్య పాఠశాల ముందు వారు ధర్నా నిర్వహించారు. పాఠశాల అనుమతుల విషయంపై అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. విచారణ జరిపి సంబంధిత విద్యా సంస్థపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ, టీఎన్‌ఎస్‌ఎఫ్, టీఎస్పీ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు బాల్‌రాజు, టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట నాయకులు పుట్ట భాస్కర్, టీఎస్పీ జిల్లా అధ్యక్షులు మావురాం శ్రీకాంత్, నాయకులు సాయి బాబ,శివకుమార్, ఫాజిల్, హకీమ్, ప్రశాంత్, వేణు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం తగదు



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడ రూరల్: పారిశుద్ధ్య పనుల నిర్వహణలో నిర్లక్ష్యం తగదని, క్రమం తప్పకుండా శానిటేషన్ కొనసాగించాలని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి వార్డు ఆఫీసర్లకు సూచించారు. గురువారం బాన్సువాడ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజుతో కలిసి సమీక్ష నిర్వహించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని డ్రెయినేజీలను శుభ్రపర్చాలన్నారు. మురికి వ్యర్థాలు, ఇతర అడ్డంకులు ఉంటే తొలగించాలన్నారు. అలాగే వార్డుల్లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాల పురోగతిని తెలుసుకున్నారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు. సమీక్షా సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గంగాధర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అంజిరెడ్డి, మహ్మద్ ఎజాస్, పిట్ల శ్రీధర్, దావుద్, భాస్కర్, వార్డు అఫీసర్లు , సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

బాన్సువాడ : పట్టణంలోని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి తన నివాసంలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను గురువారం పంపిణీ చేశారు. బాన్సువాడ పట్టణానికి చెందిన 46మందికి, బీర్కూర్‌మండలానికి చెందిన 30 మందికి, నస్రుల్లాబాద్‌కి చెందిన 23 మందికి లబ్ధిదారులకు చెక్కులను అందించారు. కార్యక్రమంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి,బీర్కూర్ మార్కెట్ కమిటీ అధ్యక్షులు దుర్గం శ్యామల, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు



క్రీడాకారులను అభినందిస్తున్న టీచర్లు

దోమకొండ/రామారెడ్డి : జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించిన 11వ జిల్లా స్థాయి అథెటిక్స్ పోటీల్లో విద్యార్థులు సత్తాచాటారు. దోమకొండ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థిని శ్రావణి బంగారు పతకం సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ చైతన్య సుధ తెలిపారు. జూలై 26 న జరిగిన పోటీల్లో అండర్ -20 విభాగం లాంగ్‌జంప్‌లో శ్రావణి జిల్లా స్థాయిలో బంగారు సాధించినట్లు వారు వివరించారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో విద్యార్థిని శ్రావణిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీలత, రమ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే ఈఅథెటిక్స్ పోటీల్లో ఉప్పలవాయిలో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులు పతకాలు సాధించారు. కే ఆనంద్ జావలిన్ త్రో లో, టీ కేదార్ సింగ్ కిలోమీటర్ పరుగు పందెంలో, ఏ సంకేత్ షాట్ పుట్‌లో, టీ చరణ్ లాంగ్ జంప్ విభాగాల్లో బంగారు పతకాలు, ఎస్.అరవింద్ 600 మీటర్ల పరుగు పందెంలో రజత పతకం, జే శ్రీ సాయి అథ్లెటిక్స్‌లో కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. వీరు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ లింగం, పీఈటీ రవీంద్ర, కోచ్ సురేష్ తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ శివరాం, వైస్ ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి అభినందించారు.

ఆలయాభివృద్ధికి సహకరిస్తా



ఎమ్మెల్యేకు వేణుగోపాల స్వామి ఆలయ విషయాలు తెలుపుతున్న మహిళా భక్తులు



తిప్పాపూర్‌లో దాతను సన్మానిస్తున్న ప్రతినిధులు

కామారెడ్డి అర్బన్: వందల ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీవేణుగోపాల స్వామి ఆలయాభివృద్ధికి సహకారం అందిస్తానని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. ఆలయ జీర్ణోద్ధరణ గాలి గోపురం, గడపలను గురువారం ఉదయం ఎమ్మెల్యే ఆవిష్కరించి స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పండితులు వేద ఆశీర్వచనం అందజేయగా ఆలయ, ధనుర్మాస ఉత్సవ కమిటీ ప్రతినిధులు, వార్డు మాజీ కౌన్సిలర్ పిట్ల వేణుగోపాల్ ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. బీజేపీ నాయకులు బి.నరేందర్‌రెడ్డి, ఎం.శ్రీకాంత్, విపుల్‌జైన్, నందివేణు, ముదాం రాజగోపాల్, కాసర్ల రవీందర్, కే.గోవర్ధన్, రాజు పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

కామారెడ్డి అర్బన్: ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులకు మంచి విద్య, క్రమశిక్షణను అందించాలని, అలాగే మధ్యాహ్న భోజనం నాణ్యతతో వండే విధంగా చూడాలని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డి అన్నారు. గురువారం ఉదయం చిన్నమల్లారెడ్డి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చేరుకుని విద్యార్థులతో పాటు ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం గర్గుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చేరుకుని అక్కడి ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. గిరిజన బాలుర గురుకుల ఉన్నత పాఠశాల వంటల గదిని, తరగతి గదులను సందర్శించారు. ఆహార నాణ్యతను పరిశీలించారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి విరాళం

భిక్కనూరు: మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించనున్న అయ్యప్ప ఆలయం నిర్మాణానికి పైడి నరేందర్-స్వప్న దంపతులు రూ.18వేలు గురువారం విరాళంగా అందజేశారు. ఈ దంపతులను ఆలయ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు రమేష్‌రెడ్డి ప్రతినిధులు ద్యావర సాయిరెడ్డి, బీంరెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీనుబాబు, నర్సారెడ్డి, సాయిలు, మల్లేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'భూభారతి' సర్వే విచారణ వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ కిరణ్మయి

నస్రుల్లాబాద్ : మండలంలో జరుగుతున్న భూభారతి సర్వే విచారణ వేగవంతం చేయాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. గురువారం మండల కేంద్రంలో గల తహసీల్దార్ కార్యాలయంలో భూభారతి రికార్డులను పరిశీలించారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను ఆగస్టు 15 వరకు విచారణ పూర్తి చేసి నివేదిక తయారు చేయాలన్నారు. తహసీల్దార్ సువర్ణ, గిర్దావార్ వెంకట స్వామి,సిబ్బంది అంజు, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల మార్కింగ్ పూర్తి చేయాలి

మండలంలోని ప్రతి గ్రామంలో లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్ల మార్కింగ్ పూర్తి చేసేలా చూడాలని కిరణ్మయి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో జీపీ కార్యదర్శులతో సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఎంపీడీవో రవీశ్వర్ గౌడ్, ఎంపీవో సూర్యకాంత్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

బోర్లం గ్రామంలో డీఎల్‌పీవో పర్యటన



ఇందిరమ్మ ఇంటి పనులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం గ్రామంలో గురువారం డీఎల్‌పీవో సత్యనారాయణరెడ్డి పర్యటించారు. గ్రామంలోని పోస్టాఫీస్ వద్ద నూతన విధానంలో ఫింఛన్ల పంపిణీ తీరు పరిశీలించారు. అనంతరం ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు పరిశీలించారు. ఇంకా పనులు ప్రారంభించని వారు వెంటనే పనులు ప్రారంభించాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీరు, పారిశుద్ధ్య నిర్వాహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పంచాయతీ కార్యదర్శి సాయికుమార్‌కు సూచించారు.

సంక్షిప్తం

ప్రభుత్వాస్పత్రిలో ఉచిత కంటి శిబిరం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రిలో గురువారం ఉచిత కంటి శిబిరం నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి శిబిరంలో వైద్యులు హరికిషన్ 49 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు.

నేడు రక్తదాన శిబిరం

సదాశివనగర్ (ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ఆర్యవైశ్య ఫంక్షన్ హాల్ లో శుక్రవారం ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు జన్మదినం పురస్కరించుకొని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, రక్తదాతల సమూహం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు తెలిపారు. పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తాన్ని దానం చేయాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యే చొరవతో మొరం పోయించిన అధికారులు

తాడ్వాయి: మండలంలోని బ్రాహ్మణపల్లి శివారులో గల రెండు బ్రిడ్జిల వద్ద ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ చొరవతో అధికారులు మొరం పోయించారు. గత ప్రభుత్వం హయాంలో బ్రాహ్మణపల్లిశివారులోబ్రాహ్మణపల్లి- కామారెడ్డి, బ్రాహ్మణపల్లి-చందాపూర్ రోడ్ల మధ్యలో నూతనంగా బ్రిడ్జిలను నిర్మించారు.బ్రిడ్జిల వద్ద నాణ్యత లేని మొరాన్ని పోయడంతో వర్షానికి బురుదమయంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఈవిషయాన్ని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతోఅధికారులు మొరం పోయించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



లింగంపేట : మండలంలోని కొట్టాల్‌గడ్డ తండాలో గురువారం సీజనల్ వ్యాధులు రాకుండా వైద్య సిబ్బంది ముందు జాగ్రత్తగా గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తండాలో ఇంటింటికి తిరిగి వ్యాధులు సోకకుండా ఉండడానికి పలు జాగ్రత్తలు సూచించారు. జ్వరాలు, ఇతర సమస్యలు ఉన్న వారికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. నీరు నిల్వ ఉన్న చోట తెమోఫాస్, పైరిత్రిమ్ మందులు పిచికారి చేశారు. ఈకార్యక్రమంలో సబ్‌యునిట్ అధికారి గోవింద్‌రెడ్డి, సీహెచ్‌వో ఠాగూర్, సిబ్బంది యాదగిరి, భాగ్య, తదితరులున్నారు.

విద్యార్థుల్లో గణిత సామర్థ్యాలు పెంపొందించాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): విద్యార్థుల్లో గణిత సామర్థ్యాలు పెంపొందించాలని కాంప్లెక్స్ హెచ్‌ఎం శోభారాణి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని బాలికల, బాలుర ఉన్నత పాఠశాల, శెట్పల్లి కాంప్లెక్స్‌లలో సమావేశాలు నిర్వహించారు. గణితంలో వెనుకబడిన విద్యార్థులకు చతుర్విధ ప్రక్రియలు నేర్పించాలన్నారు. బోధనలో లర్నింగ్ ఔట్ కమ్స్ ఉపయోగించడంతో విద్యార్థుల సామర్థ్యాలు పెరుగుతాయన్నారు. అలాగే బోధనలో ఐఎఫ్‌పీ ప్యానల్ బోర్డు ఉపయోగించడం ద్వారా అభ్యాసన ఆసక్తి పెరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు ప్రతి రోజు విద్యార్థుల ఫేసియల్ అటెండెన్స్ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు ప్రేమ్‌సాగర్, రవికుమార్, సరస్వతి, నటరాజు, శైలజ, సాయిలు, వేణుకుమార్, నర్సింలు, నవీన్, సీఆర్పీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.